## పెద్దకథ



# దేముడా నా దేశాన్ని రక్షించుము

### బలివాడ కాంతారావు

(గత సంచిక తరువాయి)

## 8

మా చిన్నతాతయ్య వుండేవాడే సీతయ్య-ఎంత తిండి తినేవాడో అంతపనిచేసేవాడు. మామ్మూలుగా వాడిని భరించడం కష్టమే. కానీ మరియెలావచ్చేదో యేమిటో యింటాబయటాతిని అప్పుడప్పుడూ నానోరు తీపిచేసేవాడు. పంటకాలంలో మోపుకుప్పలు మోసేస్తే మా పెద్దతాతయ్య నరశింహులు, తమ్ముడు లక్ష్మీనారాయణ చెవికి వెళ్ళకుండా నాలుగు చివాట్లు పెట్టేవాడు. అవి యెక్కడికి వెళ్లేవో అతనికి తెలుసు. వాడ్నిసాధారణంగా యేతాం మీద చూసేవాడిని. వేకువ ఝామునించి యేతాం మీద నడుస్తున్నవాడు ఝాము పొద్దెక్కేకగానీ చల్ది అన్నం తినడానికి వచ్చేవాడుకాదు. బండెక్కితే మొఖరు మీద మూడో పోతులా కనిపించేవాడు. పొలంలో వీడు మనిషి రూపంలో వున్నా ట్రాక్టరుతో సమానం అనుకోండి. ఇన్నిశబ్దాలు చెయ్యంచ గలిగిన వాడు సాధారణంగా మౌనంగా వుండేవాడు. అందుకే కామోసు మా అమ్మమ్మ అలా తెగ వాగుతుండేది. వీడికి చెముడూ మూగా వుందా అంటే అదీ లేదు.

ఒకసారి నాకు యేతాం ఎక్కించి నావెంటే నడు అన్నాడు. ఆరోజు క్రింద పడిపోవలసింది. మా నాన్నకు తెలిసి సీతయ్యతాత మీద కేకలేసాడు. ఇంకోసారి పొలం దున్నుతుంటే నాగలి నాచేతికి అందిచ్చి, "తిత్తా-పప్పా" అని వాడు పశువుల్ని అదిరి అరుస్తున్నాడు. పశువులు పరుగెత్తాయి. నేను బురదలో కూరుకుపోయాను. ఇంకోసారి బండిమీద కూర్చొని తాత మెడ చుట్టూ రెండు చేతులేసి -

"నేనూ బండితోలుతాను తాతయ్యా" అంటే ఆకాశం మీద నించి పోయే విమానం చూపించి -

"నువ్వు బండి తోలవు. ఆ విమానంమీద యెగురుతావు-మనవడా! నువ్వు భూమిని యేలడానికుంటే భూమి నెందుకుదున్నుతావు"? అన్నాడు.

మా నాన్న యింతమంది జ్యోతిష్యులకు నాజాతకం చూపించారు. గానీ వాళ్ళెవరూ చెప్పనిది యీ అక్షరజ్ఞానం లేని సీతయ్య తాత చెప్పింది యీనాడు నిజమైంది.

ఇక మా తాతమ్మకు చిన్నకోడలు అమ్మడుకు అప్పుడప్పుడు వాగ్యుద్ధాలు జరుగుతుండేవి. అత్తగారి హితబోధ యెలాగుండేదంటే-

"అదు పుట్టినప్పటి నించీ వుమ్మ్ము హెచ్చు పూరుతునే వుంది. అదు తెచ్చింది. యెలాగొచ్చిందని అడక్కు. తెచ్చింది వండి మూడొంతులు వాడికి పెట్టు ఒక వంతు మీరంతా తినండి."

సీతయ్య తాతకు అమ్మదవ్వ కవిత్వం అర్థం కాలేదు. ఆవిడ చేష్టలూఅర్థం కాలేదు. నలుగురు పిల్లల్లో పెద్దవాడు ఆర్జించగల యీడు వచ్చేసరికి వాడిని పట్టుకుని కన్నారింటికి వెళ్ళింది. మరిరాలేదు. మిగతా ముగ్గురు పిల్లలూ ఒక్కొక్కరే తల్లిదగ్గరకు చేరిపోయారు. పిల్లలను వదలి వుండలేక అప్పుడప్పుడు పట్నంవెళ్ళి వస్తుండిన తాతయ్య చివరకు మకాం అక్కడే పెట్టేసాడు.

కవీశ్వరుని కూతురు యిప్పుడు సర్వస్వతంత్రురాలు కాబట్టి యీ అమాయకుని మీద యెలా విరుచుకుపడ్డా అడిగేవాళ్ళు లేరని తిట్టుకవిత్వంతో మొగుడ్ని కించపరచడం మొదలు పెట్టింది. బాధపడి ఒకోసారి మావూరు నడిచి వచ్చేసేవాడు. ఒకపూటా రెండు పూటలంటే ఫరవాలేదుగానీ యెవరు రోజులతరబడి యితనిని భరించ గలరు? ఎవరి బాధలు వాళ్ళకున్నాయి. తిరిగి వెళ్ళక విధిలేక పోయేది.

వర్షాకాలం మొదట్లో ఒకరోజు చీకటి పడేవేళ యింట్లో పెళ్ళాం తిట్లూ పెద్దకొడుకు పోట్లూ తిని భరించలేక పట్నంనించి బతకాలని ఆశతో మావూరు బయలుదేరిపోయాడు. ఉరుములు మెరుపులతో వర్షం. వర్షానికి ఒక పచ్చని చెట్టుక్రింద తల దాచుకుంటే యెక్కడా చోటు దొరకనట్లు ఆ పిడుగు యీ చెట్టు మీదే పడింది. మా తాతయ్య ఆశా జ్యోతి శాశ్వతంగా ఆరిపోయింది. దీన్నే కామోసు విధి వైపరీత్యం అంటారు.

## 9

మాఇంటి దక్షిణవాసకు వెనుకకు రెండిళ్ళుండేవి. అందులో పడమరకు యేటివేపు జాలారి వెంకన్న, తూరుపువేపు పాలకుండ యెర్రయ్య వుండేవారు. ఇద్దరికీ ఆకారాల్లోగానీ అలవాట్లల్లోగాని సామ్యం వుండేదికాదు. పాలకుండవాని యింట్లో కల్లుకుండలు కనపడేవి. ఎర్రయ్య మా లక్ష్మీనారాయణ తాతదగ్గరకు తరచు లావాదేవీల విషయంలో వచ్చేవాడు. విశేషమేమంటే చెట్లు వేలంపాడి చెట్లెక్కి కల్లుకుండలను దించినవాడు. తాగేవాడుకాదు. ఎవరు వండినది వాళ్ళకు రుచితెలీదట. రుచి తెలీకపోతే యెందుకు తినాల - ఆయెందుకు తాగాలనే వాడు. ఈ నియమంవల్ల నాలుగు రాళ్ళు కల్లు వ్యాపారంలో కూడబెట్టి వడ్డీలకు తిప్పేవాడు.

ఇక జాలారి వెంకన్న జాలారి వృత్తిచేసేవాడు కాదు. నల్లగా బలిష్టమైన చేతులతో ఉండేవాడు. ఊరిలో ఇప్పటికీ ఓడరేవని ఉంది. ఆ ఓడరేవులో బల్లకట్టు వుండేది. ఆ బల్లకట్టునడిపే నావికుడు జాలరి వెంకన్న. ఎన్ని పెదేరులొచ్చినా యీ తిపికీలు కొట్టిన నీరు వాడిని ముంచలేక పోయింది. సాయంత్రం అయితే తప్పతాగేసేవాడు. గవినే

రొచ్చినా నాకు ఖాతరా అని గెంతేవాడు. వాడు మొండిమనిషని పేరు పడిపోయాడు. మూడు పూటలూ చేపల కూర లేకపోతే ముద్దదిగేది కాదు. వీళ్ళిద్దరూ కలిసి ఒకసారి మా లక్ష్మీనారాయణ తాతయ్య దగ్గరకు తగువు పరిష్కారానికి వచ్చారు. బల్లకట్టు వేళం పాడడానికి డబ్బుచాలకపోతే వడ్డీకి యెర్రయ్యదగ్గరనించి కొంత డబ్బు అప్పుతెచ్చాడు. అసలు వడ్డీ కలిపి యిస్తానంటే అసలు యిచ్చి వడ్డీ వద్దంటున్నాడు యెర్రయ్య.

"బాబూ సెప్పండి. వడ్డీకట్టకుండా ఆడికి రుణపడితే అడి రుణం యెలాతీరుస్తాను?"

"ఇదేమిటి యెర్రయ్యా? వడ్డీవ్యాపారం చేసిన వాడివి. వడ్డీ పుచ్చుకోననడానికి కారణం యేమిటి? పొరుగోడైనా యిదివరకు పుచ్చుకున్నావే".



"సీకటిపడ్డేటకదే పేణాన్ని యీ ఒడ్డునుంచి ఆ ఒడ్డుకు నసే మిరా చేర్చనివోడు ఆమద్దిన నా మాటయిని అర్థరేతిరికాడ రెండెడ్ల బండి మీద అటుపక్క ఊర్లో మొగుడు సావు బతుకుల మద్దిన వున్నాడని వచ్చినాది కాదా- ఆయమ్మని బల్లకట్టేసి పొంగిపోతున్న యేటిని బండితో దాటేసినాడు కదా- మరి వడ్డీయెలా పుచ్చుకోమంటావు?"

"ఏవిరా వెంకన్నా నివ్వేమంటావ్?"

"ఈడిమాటిన్నాను. నిజమే! ఆయమ్మ డబ్బులివ్వకపోతే పోనీ కదా యీ వడ్డీడబ్బు లుంచేసుకోమన్నందుకు వుంచేసుకుందును. నాకేల యీడిడబ్బు? మాటంటే మాటే...." అంటూ యిచ్చు రూపా యిలు "లెక్కేసుకోండి" అంటూ మాతాత అరుగుమీదపడేసి వెంకన్న వెళ్ళిపోయాడు.

అలాంటి జాలరి వెంకన్నను వరదనీరు యెన్నిసార్లు ముంచ డానికి ప్రయత్నించినా యీదుకొచ్చేవాడు. ఈ యేటిమీద వంతెన పడ్డాక కడుపుకు జరక్క కల్లుకు దొరక్క బాధపడిపోయాడు. వంతెననుచూసి భయపడ్డట్లు వర్షాలు తగ్గాయి వరదలూ తగ్గాయి. భుజంమీద వలవేసుకుని వేటకు వెళ్ళేవాడు.

వెంకన్న యీత యెరగని లోతులుండేవికావు. వీడి యీతకు లొంగని ప్రవాహం వుండేదికాదు.

ఓడరేవులో యితన్ని ముంచలేని గంగమ్మ ఓడరేవు ప్రక్కనే వున్న వల్లకాటిలో వీడి బుగ్గిని వరద వెల్లువై కలుపుకుంది.

## 10

మా వీధికి తూర్పున చివరింట్లో అప్పారావు మామ వుండే వాడు. మా లక్ష్మీనారాయణ తాత భార్య సుందరమ్మ వుందికదా. ఆవిడ అక్క ఆదెమ్మ కొడుకు. ఊర్లో వీధిలో యెందరో అప్పారావు లుండటంవల్ల యితనిని ఆదెమ్మగారి అప్పారావు అనేవారు. సంగీతం మేష్టారంటే అందరికీ తెలిసేది. గిరజాలు, ఆ పొడుగూ, ముక్కూ అంతా అచ్చంగా కపిలవాయి రామనాథ శాస్త్రిలా వుండేవాడు.

వాళ్ళింటి మొదట్లో పెద్ద జామ చెట్టు వుండేది. తెగ కాయలు కాసేది. కానీ యెవర్నీ చెట్టు యెక్క నిచ్చేవాడు కాదు. పోనీ వాళ్ళూ తీసి తినేవారుకాదు. పక్షులు కొరికి రాల్చిన పళ్ళను పిల్లలకిచ్చేవారు ఎందుకీ మామ యిలా చేసేవాడంటే ఆ పళ్ళుండటం వలన రాత్రుళ్ళు ఉదయం చిలకలు గుంపులు గుంపులుగా వచ్చేవి. అవి అరుస్తుంటే అతగాడు అరుగుమీద కూర్చొని హార్మనీ వాటి వేపు ధ్యాసగా చూస్తూ వాయించేవాడు.

ఇక ఆదెమ్మ అవ్వ వుండేదే! వేసవిలో పెరట కాగుచెట్టు కింద కూర్చునేది. చలికాలంలో కుంపటి యెదరగా పెట్టుకుని రాగాలు తీసేది. నేనొకసారి ఆమె కప్పుకున్న దుప్పటిలో దూరిపోయేవాణ్ని. అప్పుడు నన్ను గట్టిగా పట్టుకుని ముద్దెట్టి.

"కస్తూరి రంగ రంగ
మాయన్న కావేటి రంగ రంగ" అని పాడేది.

ఒకోసారి నా చేత ఆ పాటలుకూడ పాడించేది, అవిడ ఒడిలో వుండే "చూతము రారమ్మా-శ్రీ సీతారాముల కళ్యాణము చూతము రారమ్మా" ఆ మధురమైన గొంతుకనించే విని సీతమ్మ రాముల వారి కళ్యాణం కళ్ళయెదుట సాక్షాత్కరించినట్లే అనిపించడం వలన రామాయణం ఒక కథకాదనీ, నిజంగా జరిగిందే నన్న నమ్మకం నాలో యీనాటికీ నిల్చిపోయింది. కట్టుకథలైతే యిన్నాళ్ళు నిలిచిపోవు. నిజాలే నిల్చిపోతాయి.

ఈ అదెమ్మ అవ్వకి ఒక కూతురు - రంగమ్మ. ఆమెపొట్టిగా వుండేది. ఆ చేతులు కూడా పొట్టివే. ఎడమ చేతితో తినేది. ఒకరాయి విసిరితే యెడమ చేతితో విసరిన రాయే దూరంగా వెళ్ళేది. అయితే ఆ యెడమచేత్తో చేసిన వంటకాలేమో నలభీమ పాకమే నని అంటారు. ఆ వీధిలో యే శుభకార్యాలైనా వంటకాల్లో వుప్పుకారాలు వెయ్యడానికి అవిడ్నే పిల్చేవారు. ఈ రంగమ్మను పెళ్ళిచేసుకుని మొగుడు యెటో పరారయిపోయాడు. సాధువుల్లో కలిసిపోయాడంటారు. ఏ సాధు కనిపించినా తను తిండి మానేసి ఆ సాధువును పిల్చి తిండి పెట్టేది. వాళ్ళ యెదరగా కూర్చొని యేమడిగేదో యేమిటో ఆ మొగుడున్న వాని జాడ అవిడ గతించేకైనా తెలియలేదు.

ఈ సంగీతం మేష్టారు పెళ్ళి చేసుకోలేదు. సాధారణంగా కడుపు నొప్పి వస్తుండేది. కిరకిరలాడి పోయేవాడు. రోజుకు మూడు సార్లు 'సజ్జాకారం' వాడేవాడు. ఉపశాంతి కలిగినా రానురాను ఆదే పనిగా ఆ వాడుక వల్ల ప్రేగులు కోతపడ్డాయి. ఎందరికో నాటకాలు నేర్పేవాడు. గయోపాఖ్యానం, చింతామణి సత్యహరిశ్చంద్ర. ఎందరో శిష్యబృందం వుండేది. ఎవర్నీ యేదీ అడిగేవాడు కాదు. ఇస్తే పుచ్చుకునేవాడు. లేకపోతే లేదు. ఒకసారి వాడి పిన్ని సుందరమ్మ యిలాగైతే యెలా బతుకుతావంటే -

"నాకు ఒక గురువు పూరకనే యీ విద్యనిచ్చాడు. నేను ఒకరి దగ్గర కోరి పుచ్చుకుంటానా?' అన్నాడు.

ఈ పద్యాలు, కృతులూ రోజూ వినటం వలన నాకూ సంగీతం నేర్చుకోవాలని మోజు పుట్టింది. బహుశః అతని దగ్గరే

"వరవీణా మృదుపాణీ వనరుహలోచనురాణీ
సురచిర బంభరవేణీ సురనుత కళ్యాణీ."

అని సరస్వతీదేవిని లయబద్ధంగా కొలవబట్టి, సంగీతం అబ్బక పోయినా ఆవిడ కటాక్షం యింకో విధంగా నాకు కలిగింది.

గురు కట్నంగా నన్ను పొలంనించి వరి యెన్నులు తెమ్మన్నాడు. నేను ఒక మోపు మా తాతయ్యను అడిగితీసుకువచ్చాను. ఆ ధాన్యం వాళ్ళు వండుకుంటే మూడు రోజులకు సరిపోతుంది. కానీ ఆ వరి కంకులతో జటల్లా అల్లాడు. నాలుగు జెటలల్లి పళ్లూ కాయలూ ఆ సరికి లేని జామిచెట్టు నాలుగు కొమ్మలకూ కట్టాడు. పిచ్చుకలు, మైనాలు వచ్చి తింటూ శబ్దాలు చేసేవి. తన్మయత్వం జెంది. హార్మనీ మీద అవేవో రాగాలను ఆలాపన చేసేవాడు.

నేను పట్నంలో చదువుకుంటున్నప్పుడు - ఒకసారి మావూరు వెళ్లేటప్పటికి సంగీతం మాష్టారు చావుకు నిరీక్షిస్తున్నట్లు వాకిటపడి వున్నాడు. నేను పక్కన కూర్చున్నాను. నన్ను పోల్చి నట్లుంది. చిన్న నవ్వు పెదాలమీద వెలసింది. అయన.

"నిధి సుఖమా దేవుని సన్నిధి సుఖమా" అన్న త్యాగరాయ కీర్తన పెదాలమీద ఆడిస్తూనేపోయాడు.

## 11

ఈ మనుష్యులు-యీ వాతావరణం పెంచిన బిడ్డనునేను.

ఇక్కడ కూర్చుంటేగానీ యీతలపులు ఆనాటి తలపులిచ్చే మనశ్శాంతి నివ్వవు. అందుకే మనసు చెలించినప్పుడల్లా మా గ్రామం వచ్చేసి యీ స్తంభానికి చారబడి గంటల తరబడి నా చిన్ననాటి రోజులను నెమరువేసుకుంటాను. నన్ను మనిషిగా మలిచిన నా తొలి పది సంవత్సరాల జీవితంలాటి జీవితాన్ని నాకొడుకు పట్నంలో పుట్టి అక్కడి నిత్యపోరాటం పచ్చిస్వార్థం, పీకలు తెగేసే పోటీలు పడే వాతావరణంలో అనుకరణ చర్వితచర్వణం. చౌకబారు అశ్లీలమైన సినీమాలు, సాహిత్యం మధ్యపెరిగి చవిచూడలేక పోయాడు. వాడు దేశంలో వయస్సు పరిమాణం పెరిగినా రేపుమనది కానట్లు పరుగెత్తే ప్రజలమధ్య పెరుగుతూ వాళ్ళ అన్యాయ మార్గాలను ఆదర్శాలుగా తీసుకుంటున్నాడు. మన సాంప్రదాయాలూ విలువలనూ పల్లెల్లో బ్రిటిష్ పాలకులు కలుషితం చెయ్యలేదు. కాబట్టి గాంధీ మహాత్ముని వంటి నీతికీ నిజాయితీకి నిలబడ్డ నాయకులు ప్రజలను విలువలతో ప్రభావితులనుచేసి స్వాతంత్ర్య పోరాటం జరిపారు. స్వాతంత్ర్యంవచ్చేక మన యీ విలువలు పల్లెనించి పట్నానికి ప్రయాణం చేసేబదులు, కలుషితమైన పట్నపు విలువలు పల్లెలకు ప్రాకిపోతున్నా యన్నందుకు నిదర్శనం అదిగో అటు తూరుపువేపు. ఇదివరకు యిక్కడ కూర్చొని చూస్తే—

మామామిడితోట పచ్చదనం కనపడేది. వర్షాకాలంలో యిలాంటి సాయంత్రపు ఎండలో ఒకోసారి ఆపచ్చదనం మీద రంగుల కిరీటంలా హరివిల్లు ప్రత్యక్షమయ్యేది. కొంగల గుంపులు పచ్చదని పొలాల

మీద నించి యెగిరి చెట్లపై గుంపులుగా వ్రాలేవి. పచ్చదనంలో మెరిసి పోతున్న యీ చెట్లపై పూల హారాల్లా పిట్టల గుంపులు కదిలేవి.

నాకు యీతోట మీద మమకారం పుట్టడానికి కారణముంది. మాతండ్రి తండ్రి రామమూర్తి. అతను అతోటలో యెవరినీ ఒకకొమ్మ కొట్టనిచ్చేవాడు కాదు. విరిగిన కొమ్మలనీ పడిపోయిన చెట్లనే వంట చెరకుగా తెచ్చేవాడు. "బ్రతికిన చెట్టుకు బ్రతికిన మనిషికీ భేదంలేదు. ఒకచెట్టు నరికితే ఒకమనిషిని ఖూనీచేసినట్లేలెఖ్ఖ" అనేవాడు.

అతని మాటలు గుర్తుండటం వలన యీ తోటను సర్కారు వారికి అప్పచెప్పడానికి నేను అనుమతించలేదు. కానీ యిది ప్రజోపయోగానికి అవసరం అన్నషరతుమీద వారంరోజుల్లో యెనభయ్యేళ్ళు పెరిగిన చెట్లన్నీ టిసీ ఖూనీచేసేసారు. అదిగో పొగ కనిపిస్తోందిగా! ఇది ఒక ఆర్థికంగా వెనుకబడ్డ ప్రాంతం. ఈ ప్రాంతపు రాజకీయ నాయకుని పలుకుబడి పెంచుకుని మంత్రిపదవి మరో పదికాలాలపాటు నిల్పుకోడానికి పరిశ్రమలతో తన నియోజక వర్గాన్ని పోషించికాపాడ్డానికి యిక్కడో కర్మాగారం యేర్పరచాడు.

ఈ నాయకుడు ఒకప్పుడు బస్సుక్లీనరుగా వుండేవాడట. క్లీనరునించి కండక్టరు. తరువాత బస్సులో వాటా. ఇలా పాతిక బస్సుల రాబడితో కొత్తవ్యాపారాలు చేసిపదిసంవత్సరాల్లో కోటీశ్వరుడయ్యాడు. కోటీశ్వరుడయ్యాడే గానీ వాడిని రకరకాల పన్నుల గాలులు తగిలి జబ్బు చెయ్యకుండా వుండాలని తనపరపతిని ఒట్లుగా మార్పించుకున్నాడు. తనను ప్రజలు కొలవడానికి మాటలతోపాటు పనిచేసి చూపించాలికదా. ఎన్నికల సంరంభంలో అరిచే మనుషులూ, తిరిగే జీపు, లెక్కకు దొరకని డబ్బు విరజల్లేస్తోమత వున్నవాడు కదా!

"ఇక్కడ యీ పరిశ్రమను యీ ప్రాంతంవాళ్ళ కోసం పోట్లాడి తెచ్చాననీ-దీనికి యెన్నో అవాంతరాలొచ్చి ఆలస్యమైందని-అందులో ముఖ్యంగా యీ జాగాటీసుకోడానికి యిబ్బందులు వగైరా" అంతా యేకరు పెట్టినవాడు ఆ ప్రాంతం యొక్క యెల్లలేవో చెప్పక పోవటం వలన యీ రాష్ట్రంలో యింకొక ప్రాంతంనించి వచ్చిన వాళ్లనీ, యీ చుట్టుపట్ల వూళ్లవాళ్లనీ, ప్రక్కజిల్లావాళ్లనీ-యిలా మనుషులు వేరువేరుగా విడిపోయారు. మనసులూ విడిపోయాయి. వేర్వేరు నక్కచిక్కులు. ఒకయూనియన్ లీడరు ఒకటంటే యింకో వాడుదానికి వ్యతిరేకంగా అంటూ ప్రాంతాలతోపాటు జాతులుకూడా పోట్లాడుకుంటున్నాయి. ఆఖరికి నేను వెళ్లిన ఆరోజున ఆ క్రైముకి..,

అప్పుడే చీకటిపడింది. ప్రగతికి చిహ్నమైన ట్యూబ్‌లైటు మావీధిలో వెలిగింది. అలాచూస్తూండగానే ఫేక్టరీలో కోలాహలం వినిపిస్తోంది. వాళ్లోవాళ్లే కొట్టుకుంటున్నట్లు కేకలు చెప్తున్నాయి. మావీధిలోనే అద్దెకున్ననలుగురు పరుగెత్తుకు వచ్చేశారు. వాళ్లను వెంట తరుముతూ వచ్చినవాళ్లచేతుల్లో కత్తులున్నయ్. తలుపులు వేసుకున్నా బాదేస్తున్నారు.

"బాబూవెళిపోండి" అన్నాను.

"ఎవ్వడ్రానివ్వు" అని ఒకడు కళ్లెర్రజేసి నావేపు జూశాడు.

"ఈమట్టిలో ఒకప్పుడు సంగీతం మేష్టారు వుండేవారు. అతని శిష్యుడను. అలాంటి పవిత్రమైన జాగాలో ఖూనీలు జరపకండి బాబూ. అన్నాను.

ఇంతలో పోలీసులొస్తున్నారని కేకవినపడగానే నలుగురూ పరుగెత్తిపోయారు. తలుపుతట్టాను. "వాళ్ళువెళ్లిపోయారు. ఫరవాలేదు తియ్యండి బాబూ" అన్నాను.

మా అమ్మగొంతు విన్నాకగానీ వాళ్ల తలుపుతియ్యలేదు. ఒకడికి చెయ్యిమీద దెబ్బతగిలింది. రక్తంయింకా కారుతోంది. కట్టుకట్టూ.

"ఏవూరు బాబూమీది" అన్నాను.

"విజయవాడ" అన్నాడు.

ఇంతలో పోలీసులు రావటం యీనలుగుర్నీ తీసుక వెళ్ళడం జరిగింది.

అలా చీకటిలో యెంతసేపు కూర్చున్నానో, అమ్మతినమన్నా తిండి సహించలేదు. నాచిన్న నాడు యెవరిజాగాలో వాళ్లనిపెరగనిచ్చేవారు. ఇప్పుడో! ప్రతిపెద్దా ఒకవటవృక్షమైపోదామనే తాపత్రయం. ఆ వటవృక్షం క్రింద యింకేమీ పెరగడానికి వీల్లేదు. పెరగవు-పెరగనివ్వరుకూడాను. ఇలా పెరగటం స్వాభావికంగా జరిగినా బాగుండేది. ఈ రోజుపుట్టి రేపటికే మహావృక్షమై పోదామన్న కాంక్షలో కత్తిపట్టుకుని యెదురుపడ్డవాళ్లందరినీ జడిపించి తినేస్తున్నారు. పెద్దరాకాసికి కుంభం పొయ్యాలని చిన్నరాకాసులు ప్రజలమీద పడ్తున్నారు. ఇలారాకాసి రాజ్యం కాకుండా మనుషుల రాజ్యంగా నిలవాలంటే యేంచెయ్యాలి?

అర్థరాత్రిదాటినా అంతాచీకటి. నాకేంతోచలేదు. ఇన్నాళ్ళూ పగిలి రెండుకాకుండా వుండాలన్న తాపత్రయంలో మనశ్శాంతి నిచ్చే ఒకజాగా యీ భూమ్మీద వుందనుకున్నానో ఆజాగాకూడా కలుషితమై పోయింది.

నాతలనించి పాదాలవరకూ పగిలి నేను రెండు చెక్కలై పోతున్నట్లు శరీరమంతా వణుకు పుట్టేసింది. వాకిట్లోకి పరుగెత్తి కాశీపతి తాతచెప్పిన ఆ సవరవాని అమాయక హృదయంతో ఆకాశం వేపు చేతులెత్తి "దేముడా! నాదేశాన్ని రక్షించు....రక్షించు" అని గట్టిగా మొరపెట్టేశాను.

(అయిపోయింది)